వాటర్‌బోర్డులో అక్రమాలను అరికట్టాలి



ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌కు మెమోరాండం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: వాటర్‌బోర్డులో పదేళ్లుగా జరుగుతున్న అక్రమాలను, అవినీతిపై విచారణ జరపాలని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ చింతపండు నవీన్‌కుమార్‌కు ఆయన మెమోరాండం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ..కొన్ని ఏళ్లుగా వాటర్‌బోర్డులో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందన్నారు. రిటైర్డ్ అయిన అధికారులు కూడా ఎక్స్టెన్స్ తీసుకొని తమ సీట్లను వదలడం లేదన్నారు. ఏఎంఎస్ విధానాన్ని అమలు చేసి కాంట్రాక్టర్లను రోడ్డుపాలు చేశారన్నారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానన్నారు.

అంటు రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



మందులు పంపిణీ చేస్తున్న ఆల పురుషోత్తమ్‌రావు

అబిడ్స్: అంటురోగాలు, విష జ్వరాలు ప్రబలకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు పేర్కొన్నారు. ఆగాపురాలోని ఆయన కార్యాలయంలో విద్యార్థులకు హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆలపురుషోత్తమ్‌రావు మాట్లాడుతూ.. విషజ్వరాలు పెద్ద ఎత్తున వస్తుండడంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అన్ని ప్రాంతాల్లో పర్యటించి విషజ్వరాలు ప్రభలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ ఆగాపురా అధికారి డాక్టర్ ఉమైరా సరీన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లాల్లో మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి



జలమండలి జీఎంతో మాట్లాడుతున్న దేవర వంశీ తదితరులు

గోల్కొండ: నల్లాలలో మురుగు నీరు వస్తుందని బీజేపీ నాయకులు దేవర వంశీ అన్నారు. గురువారం ఆయన జలమండలి జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యంను కలిశారు. గుడిమల్కాపూర్ డివిజన్‌లోని నల్లాల్లో మురుగు నీరు వస్తుందని అధికారులు దీనిపై స్పందించాలని ఆయన జీఎంకు వినతిపత్రం సమర్పించారు. గుడిమల్కాపూర్ డివిజన్‌లోని ఎన్నో ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్‌లలో డ్రైనేజీ పైప్‌లైన్‌ల మురుగు నీరు కలుస్తుందని ఆయన అన్నారు. నల్లాల్లో మురుగు నీరు రాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కాగా క్షేత్రస్థాయి సిబ్బందితో మునుముందు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాడని జీఎం హామీ ఇచ్చారు.

రెయిన్‌బజార్‌లో ఎమ్మెల్యే పర్యటన



యాకుత్‌పురా: విషజ్వరాలపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. నియోజకవర్గంలోని రెయిన్‌బజార్ డివిజన్‌లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తున్న జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్‌నగర్ సర్కిల్ మలేరియా సిబ్బందితో ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ..జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు అన్ని ప్రాంతాల్లో ఫీవర్ సర్వేలు చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాన్నారు. అనంతరం మలేరియా సూపర్‌వైజర్ మహేష్ మాట్లాడుతూ..జోనల్ కమిషనర్ వెంకన్న, మలేరియా సీనియర్ ఎంటామాలజిస్టు నామల శ్రీనివాస్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని బస్తీ, కాలనీలలో ఫాగింగ్ నిర్వహిస్తూ ప్రజలకు సూచనలు చేస్తున్నామని తెలిపారు. రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, మలేరియా సిబ్బంది ఉన్నారు.


కర్రపూజతో మండపం నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న వెంకటేశ్ తదితరులు

గౌలిపురా: లాల్‌దర్వాజాలోని ఓంకార్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వినాయక మండపం కోసం గురువారం సంప్రదాయ ప్రకారం శాస్త్రోక్తంగా కర్రపూజ నిర్వహించి మండపం నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ..సెప్టెంబర్ 7 నుంచి 17వ తేదీ వరకు గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 11 రోజుల పాటు నిర్వహించే వినాయక ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం నుంచి అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి చైర్మన్ కె.సంజీవ, ప్రెసిడెంట్ పంకజ్ షిండే, ప్రతినిధులు శ్రీకాంత్ ముదిరాజ్, కె.దీపక్, రాహుల్, అంకిత్, చంటి, ప్రవేశ్, భాగవత్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో సినీ విజ్ఞాన విశారద ఎస్వీ.రామారావు 85వ జన్మదిన వేడుకలను గురువారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాఖ్యాతలు ఆశాలత, ఎ.మురళీకృష్ణ, ఎం.ధక్షణమూర్తి, వీవీ రావులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు సినీ గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు కేవీ రమణాచారి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్, యువకళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

గోల్కొండ: తెలుగు భాషా తేనెకంటే తీయ్యనిదని గోల్కొండ బజార్‌లోని తెలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈద లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఈడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండితురాలు నిర్మల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత మహ్మద్ ఖదీర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కథలు సమాజానికి ప్రతిబింబాలని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ అల్లం విజయరాణి ఆయనకు జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ విష్ణుప్రియ తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.



గోల్కొండ తెలుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..



ప్రముఖ కథా రచయిత మహ్మద్ ఖదీర్‌బాబుకు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

గౌలిపురాలో..

గౌలిపురా: జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్‌లో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత్త, ప్రిన్సిపాల్ వి.ప్రభాకర్‌రావు అధ్యక్షత వహించగా స్నేహలత, ప్రసన్నలక్ష్మీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.రమాదేవి మాట్లాడుతూ.. తెలుగు భాష ఔనత్యాన్ని వివరించారు. విద్యార్థులను ఎంతో ఆసక్తి కలిగించిన ఈ కార్యక్రమం చదువు పట్ల భాష పట్ల అంకితభావంతో చదువుకుంటామని అందరూ ప్రతిజ్ఞ చేశారు.



కార్యక్రమంలో ఏక్తా జనశక్తి ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు



తెలుగు విశ్వవిద్యాలయలో..

ఘనంగా గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి..

సాక్షి, సిటీబ్యూరో: తెలుగు విశ్వవిద్యాలయలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆచార్య డి. విజయలక్ష్మి మాట్లాడుతూ..గిడుగు రామ్మూర్తి పంతులు ఆనాటి గురజాడ, శ్రీనివాస అయ్యంగార్లతో కలిసి తెలుగు భాష సమున్నతి కోసం ఏ రకంగా కృషి చేశారో సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు, డాక్టర్ బాణాల భుజంగరెడ్డి, ఆచార్య గోనసాయక్, ఆచార్య వారిజారాణి, ఆచార్య త్రివేణి, డాక్టర్ భూక్య తిరుపతి, డాక్టర్ విజయ కుమార్, డాక్టర్ బాశెట్టి లతా పాల్గొన్నారు.

ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

యాకుత్‌పురా: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గురువారం ఏక్తా జనశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ప్రైమరీ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరిచుకొని ఆయన చిత్రాపటానికి పూలమాల వేసి నివాళులర్పిచారు. ఏక్తా జనశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు రాజేష్‌యాదవ్, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, ఉపాధ్యాయురాలు రామలక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



జ్ఞాన భారతి మోడల్ హై స్కూల్‌లో..

నేడు మీరాలంమండిలో సామూహిక వరలక్ష్మి వ్రతం

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం పూజలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం పంచ హారతి, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇందుకోసం ఇప్పటికే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజల కష్టాలు తీర్చడమే లక్ష్యం

గోల్కొండ: మజ్లిస్ పార్టీకి ప్రజల కష్టాలు, సమస్యలు బాగా తెలుసని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ వద్ద పర్యటించారు. ఆయన ఫుట్‌పాత్ ఆక్రమణలను, రోడ్లపై వ్యాపారం చేస్తున్న వారిని కలిశారు. ఆయన మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లు, రోడ్లు కబ్జాలు కావడం వల్ల వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల కష్టాలు తీర్చడమే తన లక్ష్యం అని కొందరూ వ్యాపారుల కోసం వేలాది వాహనాదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎవరికి ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకుంటే ఇబ్బందులు ఉండవన్నారు.

ఉత్సాహంగా ఉట్టి వేడుక

అబిడ్స్: పూసల బస్తీలో ఉట్టి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆర్కిటెక్ ఇంజినీర్ వాస్తు శిల్పి ఆవుల అరుణ, ఆవుల కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ ఆవుల అరుణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయిరు. విజేతలకు నిర్వాహకులు ఆవుల కృష్ణారావు, ఆవుల అరుణ బహుమతులు అందజేసి అభినందించారు.



గ్రంథాల ఆవిష్కరణ

సుల్తాన్‌బజార్: నవ్య సాహితీ సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి తెలుగు విశ్వవిద్యాలయ కీర్తి పురస్కార గ్రహీత డాక్టర్ మాదిరాజు బ్రహ్మానందరావు రచించిన 'వింటూ ఉంటే చెబుతూ ఉంటా'పద్య మౌక్తికాలు ఐదవ భాగం, ప్రముఖ సాహితీవేత్త నవ్య సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర రచించిన 'శ్రీ సీతారామ పదోత్సవ తారావళి పద్యకృతి'అనే గ్రంథాల ఆవిష్కరణ సభ గురువారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణ దేవారాయ తెలుగు భాషా నిలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ కేవీ రమణాచారి హాజరై గ్రంథాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాషా నిలయంలో ఇలాంటి మహోన్నత గ్రంథాలను ఆవిష్కరించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ..నేటి సాహిత్య కార్యక్రమం మంగళకరంగా ఉందన్నారు. రాష్ట్ర ఖజాన, లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర, డాక్టర్ సంఘంభట్ల నర్సయ్య, దత్తాత్రేయ శర్మ, సాధన నర్సింహాచార్యులు, నవ్య సాహితీ సంస్థ ఉపాధ్యక్షులు వేమరాజు విజయ కుమార్, సమన్వకర్త నిష్టల సుధామాల, ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మీమానస పాల్గొన్నారు.



గ్రంథాలను ఆవిష్కరిస్తున్న రమణాచారి, ఓలేటి పార్వతీశం తదితరులు

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

గోల్కొండ: వినాయక మండపాల ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులు తప్పనిసరి అని గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. గురువారం గోల్కొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక మండపాల నిర్వాహకులు, మైత్రి కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటుకు ముందుగా పోలీసుల అనుమతి తప్పనిసరి అని అన్నారు. మండపానికి విద్యుత్ కోసం తప్పనిసరిగా డీడీ పెట్టాలని అన్నారు. మండపం ఏర్పాటైన ప్రాంతం సెక్టర్ ఎస్సై నెంబర్ నిర్వాహకులు తమ వద్ద ఉంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గోల్కొండ డీఐ రాజేంద్రప్రసాద్, ఎస్సై మహ్మద్ రఫీ, వెంకటేష్, పీస్ కమిటీ ప్రతినిధులు పరమానందం, ఇలియాస్ అక్బర్, షానవాజ్‌ఖాన్, పూస వేణుగోపాల్, హనుమాన్, రాము, వివిధ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు

ప్రభుత్వ న్యాయవాద నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలి

సిటీ కోర్టులు: ప్రభుత్వ న్యాయవాద నియామకాల్లో సామాజికి న్యాయం పాటించాలని లాయర్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి, నాంపల్లి కోర్టు న్యాయవాది నర్రి స్వామి తెలిపారు. గురువారం ఆయన లా చీఫ్ సెక్రటరీ రెడ్ల తిరుపతిని తెలంగాణ సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ న్యాయవాద నియామకాలలో సామాజిక న్యాయం పాటించడంతోపాటు న్యాయవాదులకు రక్షణ చట్టాలను ఏర్పాటుచేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన లా చీఫ్ సెక్రటరీ ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, న్యాయవాదులందరికి సమన్యాయం జరిగేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. నాంపల్లి కోర్టు న్యాయవాదులు గోరకంటి వినోద్, కుమార్, మహేశ్, కరికే మల్లేశ్, రవీందర్, నర్సింహ ఉన్నారు.



లా సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాది నర్రి స్వామి

తెలంగాణ రైతుల సంక్షేమానికి కృషి



గన్‌ఫౌండ్రీ: గుజరాత్ రాష్ట్ర సహకార వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో జరిగిన 175 జాతీయ సహకార గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ ఫెడరేషన్ వార్షిక మహాజన సభలో తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిస్కాబ్ డైరెక్టర్లు కె.రవీందర్‌రావు, బోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత జీవనగీతగా మారాలి

గన్‌ఫౌండ్రీ: భగవద్గీత మరణగీత కాకుండా జీవనగీత కావాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం రవీంద్రభారతిలో గీతా ఫౌండేషన్ 18వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని, ప్రతి ఒక్కరి ఇంట్లో భగవద్గీత ఉండాలని సూచించారు. భారతదేశంలో గీతా, గోవును కాపాడుకున్నప్పుడే హిందూ ధర్మం ముందుకు వెళ్తుందని తెలిపారు. అంతకు ముందు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర మహిళా భజనమండలిచే భక్తి గీతాలు, విష్ణు సహస్రనామ పారాయణం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గీతా ఫౌండేషన్ చైర్మన్ బైలూరు యోగేష్ ప్రభు, కొల్లూరు పవన్, శంకర్ స్వామీజీ, సామర్ల వెంకటేశ్వర్‌రావు, బడేసాబ్, శ్రీనివాస్ యాదవ్, గంట మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిమ్‌కార్డులతో మోసాలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

గన్‌ఫౌండ్రీ: సిమ్ కార్డులను కొనుగోలు, విక్రయించడంలో మోసాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను గురువారం అబిడ్స్ పోలీసులతో కలిసి ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 7 మొబైల్ ఫోన్లు, 1748 సిమ్ కార్డులు, రూ.7460 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లాకు చెందిన ఎస్.వెంకటేష్(35) సాఫ్ట్‌వేర్‌గా పనిచేసి 2022లో వ్యాపారాన్ని ప్రారంభించి నష్టాల్లో కూరుకుపోయాడు. జాబ్ లేకపోవడంతో సోషల్ మీడియా ద్వారా సైబర్ మోసగాళ్ల ఫ్రీ యాక్టివేటెడ్ సిమ్‌కార్డుల డిమాండ్ గురించి తెలుసుకున్నాడు. వెంటనే కడప జిల్లాకు చెందిన సద్దాం హుస్సేతో కలిసి ఒక్కొక్క సిమ్‌కార్డును రూ.400లకు సైబర్ మోసగాళ్లకు విక్రయించేలా పథకాన్ని రచించారు. సిమ్‌కార్డుల కోసం వచ్చే వ్యక్తుల గురించి వారికి తెలియకుండా వారి ఆధార్ కార్డులను సేకరించి సిమ్‌కార్డులను యాక్టివేట్ చేసేవారు. అలా యాక్టివేట్ చేసిన సిమ్‌కార్డులను సైబర్ మోసగాళ్లకు విక్రయించే వారు. ఈ నేపథ్యంలో పలువురు వినియోగదారులు ఫిర్యాదు చేయగా ఐదుగురు ముఠా సభ్యులను పట్టుకున్నట్లు తెలిపారు. వారిమీద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరికి జైలు

గౌలిపురా: భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని పోలీసులు గురువారం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరచగా స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం..బండ్లగూడకు చెందిన సయ్యద్ హమీద్(36), షాహీన్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ ఇమ్రాన్ (36)లు ఇటీవల భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. దీంతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వీరిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. దీంతో వీరిపై కేసు నమోదు చేసుకొని గురువారం సయ్యద్ హమీద్, మహ్మద్ ఇమ్రాన్‌లను కోర్టులో హాజరుపరచగా పూర్వపరాలను పరిశీలించిన స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

జియాగూడ: గంజాయి విక్రయిస్తూ ఇద్దరు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గోషామహల్ డివిజన్, మంగళ్‌హాట్ పోలీసుల వివరాల ప్రకారం.. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం లభించడంతో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఒడిస్సా తాంశాపోస్ట్, మల్కాంగిరికి చెందిన మిలాంటి దేబనాథ్, మంగళ్‌హాట్‌కు చెందిన బి.అభిషేక్‌ను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 21.492 కేజీల గంజాయి, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు గోరుసింగ్, మున్నా, ధీరజ్, జైదేవ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సిటీ కోర్టులు: యశోద ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నాంపల్లి క్రిమినల్ కోర్టులో నిర్వహించడం సంతోషకరమని నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.సురేశ్ తెలిపారు. గురువారం నాంపల్లి కోర్టులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జస్టిస్ సురేశ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులందరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యం పట్ల తగిన చర్యలు తీసుకొని జాగ్రత్తగా ఉండాలన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రతీది సాధించేందుకు సాధ్యం అవుతుందని తెలిపారు. న్యాయవాద వత్తి అంటేనే ఉరుకుల పరుగుల జీవితమని, అందుచేత చాలా మంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించకుండా అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. అందుచేత ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. నాంపల్లి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజావర్ధన్‌రెడ్డి, జనరల్ సెక్రెటరి సీవీ శ్రీనాథ్, జాయింట్ సెక్రెటరి మామిడాల రమేశ్, బార్ అసోసియేషన్ మెంబర్లు ఈశ్వర్ కుమార్, రాజాగోపాల్, దయాకర్, కవిత, కుమార్ పాల్గొన్నారు.



పరీక్షలు చేయించుకుంటున్న న్యాయమూర్తి జస్టిస్ సురేశ్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మారం జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేన్‌కు మెమోరాండం అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయాల్లో కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించుటకు 2016 నుంచి జూనియర్ అసిస్టెంట్ల కోసం వెంటనే దరఖాస్తు చేసుకున్న వారికి ఉద్యోగాలు ఇవ్వాలని పలువురు నాయకులు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్, ఎస్ఎం.ముజీబ్ హుస్సేన్ మాట్లాడుతూ..దీర్ఘకాలిక సమస్యలను త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. టీఎన్జీఓ యూనియన్ ఉద్యోగులకు అండగా ఉండి వారి సంక్షేమానికి, వారి అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు భారత్, సంతోష్, రాహుల్, శ్రీకాంత్, అజిత్, సాయికృష్ణ, రామకృష్ణ, రమేష్, నిరాజ్, నాగమణి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

నియామకం

విజయనగర్‌కాలనీ: గౌడ్ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ ప్రచార కమిటీ కార్యదర్శిగా కొన్నె సతీష్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు గౌడ్ కులహక్కుల పరిరక్షణ సమితి సంఘం జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణగౌడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి నక్క మహేందర్‌గౌడ్, మహిళా జాతీయ అధ్యక్షురాలు లక్ష్మీశైలజ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రేనుట్ల మహేష్‌గౌడ్ చేతుల మీదుగా సతీష్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సతీష్‌గౌడ్ మాట్లాడుతూ..గౌడ్ కుల హక్కుల సాధనలో భాగంగా జరిగే ఏ పోరాటమైనా అందులో ముందుంటానన్నారు. తెలంగాణ మహిళా అధ్యక్షురాలు కొన్నె మాధవీ గౌడ్, నాగమణి గౌడ్, యారల శ్రీకాంత్‌గౌడ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు కొకుంట్ల మల్లేష్‌గౌడ్, ముత్యం బాలరాజ్ గౌడ్, బూడిద లక్ష్మణ్‌గౌడ్, నక్క శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.



సతీష్‌గౌడ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న కృష్ణగౌడ్, మహేందర్‌గౌడ్

ప్రముఖ సంఘ సేవకుడు రాందాస్ మృతి

గోల్కొండ: సీనియర్ బీజేపీ నాయకుడు, దళిత ఉద్యమనేత అల్లూరి రాందాస్(68) బుధవారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. టోలిచౌకీ అక్బర్‌పురా దళిత నాయకుడిగా ఆయన పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. బీజేపీలో సైతం చురుకైన నాయకుడిగా పేరుపొందారు. గురువారం సాయంత్రం నానల్‌నగర్ ఫ్లోర్ మిల్ హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

కాచిసంఘ్ నాయకుడు కాచి ప్రకాష్ మృతి..

ప్రముఖ బీజేపీ నాయకుడు కాచిసంఘ్ మాజీ అధ్యక్షుడు కాచి ప్రకాష్(67) గురువారం మృతి చెందారు. రాంసింగ్‌పురాలోని ఆయన స్వగృహంలో అనారోగ్యం కారణంగా ఆయన మృతి చెందారు. కాచి కులస్తుల సంక్షేమం కోసం గత నాలుగు దశాబ్దాలుగా ఆయన కృషి చేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు కార్వాన్‌లోని హిందూ శ్మశానవాటికలో జరిగాయి.



అల్లూరి రాందాస్



కాచి ప్రకాష్